క్లుప్తంగా

నేడు వీఎంసీలో పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు వీఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌తోపాటు వీఎంసీ సర్కిల్ కార్యాలయాల్లోనూ జరుగుతుందన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో, సత్యనారాయణపురంలో సర్కిల్-2లో, పటమటలోని సర్కిల్-3లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లోన్ని సమస్యలను అధికారుల దృష్టికి నేరుగా తీసుకొచ్చి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుర్గా కిషోర్‌కు మదర్ థెరిసా ప్రేరణ పురస్కారం



భవానీపురం(విజయవాడపశ్చిమ):మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని విద్యాధరపురం కబేళా సెంటర్ బ్రహ్మయ్య కాలనీకి చెందిన వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ ముత్తంశెట్టి దుర్గా కిషోర్‌కు మదర్ థెరిసా జాతీయ ప్రేరణ పురస్కారం లభించింది. మదర్ థెరిసా ఎడ్యుకేషనల్ సొసైటీ వార్షికోత్సవం సందర్భంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్‌సీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సొసైటీ చైర్మన్ డాక్టర్ దిడ్ల కిషోర్, డాక్టర్ వడియార్, సీఆర్‌సీ రూపకర్త విక్టరీ వెంకట్రామిరెడ్డి, సీఐ రమణమ్మ చేతుల మీదుగా దుర్గా కిషోర్ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న మదర్ థెరిసా స్ఫూర్తితో విజయవాడకు చెందిన వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న దుర్గా కిషోర్ అభినందనీయులని నిర్వాహకులు కొనియాడారు.

జానపద కళలను పరిరక్షించుకోవాలి



విజయవాడ కల్చరల్: జానపద కళలను పరిరక్షించుకోవాలని ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. దామోదర జానపదం, దేశికా ఆర్ట్స్, మామ్ ట్రస్ట్, లోక కళాపరిషత్ ఆధ్వర్యాన అంతర్జాతీయ జానపద దినోత్సవం సందర్భంగా ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జానపదం, ఆట-పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ జానపద గీతాలు తెలుగు వారి ఆత్మ అని అభివర్ణించారు. జనుల హృదయాన్ని కదిలించేది జానపదమని తెలిపారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ జానపదం జనపదం అని అభివరించారు. గాయకులు పలు జానపద గీతాలను ఆలపించారు. అనంతరం వేముల హజరత్తయ్య గుప్తా, సుశీల్‌కుమార్, భారతి, రమణ, ఎస్. కృష్ణవేణి, రెడ్డి ప్రసాద్, బండి ఉషారాణి, పి.వెంకటరమణ, వైష్ణవి, అత్తలూరి విజయలక్ష్మి తదితరులకు కృష్ణవేణి జానపద సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, బొండా జగన్మోహనరావు, మాసాబత్తుల శ్రీనివాస్, మహంతి వాసుదేవరావు, లింగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళాలు



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి పలువురు భక్తులు ఆదివారం విరాళాలు అందజేశారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన పోట్లపల్లి నాగిరెడ్డి, మల్లేశ్వరి దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.22,500, వజ్రకిరీటం తయారీకి రూ.22,500 ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. గుంటూరు కొత్తపేటకు చెందిన చిరుమామిళ్ల రవికుమార్, శ్రీలక్ష్మీ దంపతులు అన్నదానానికి రూ.10,116 అందజేశారు. దాతలను అమ్మవారి శేషవస్త్రం తో సత్కరించారు.

యోగా, వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక

నున్న(విజయవాడరూరల్): మండలంలోని నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రతి రోజూ యోగా, వాకింగ్ చేసేవారు నూతనంగా యోగా, వాకర్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. ఈ అసోసియేషన్‌కు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నిక నిర్వహించారు. యోగా, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కలకోటి వీరారెడ్డి, ఉపాధ్యక్షుడిగా షేక్ బాజీ, ప్రధాన కార్యదర్శిగా తుమ్మల శివయ్య, సహాయ కార్యదర్శిగా కలతోటి కొండలరావు, కోశాధికారిగా దేవులపల్లి గోపాలరావు ఎన్నికయ్యారు. ఈ కమిటీని యోగా గురువు పోలారెడ్డి సాంబిరెడ్డి, గుంటక గోపాలరెడ్డి తదితరులు అభినందించారు.

కేఎల్‌రావు పార్కుపై పర్యవేక్షణ కరువు!

- మూలకు చేరిన చిన్నారుల ఆట పరికరాలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పార్కు సిబ్బంది
- మురికి వాసన మధ్య వాకింగ్ చేయాల్సిన దుస్థితి



బోట్లు లేక బోసిపోయిన పార్కు కెనాల్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కేఎల్‌రావు పార్కు అభివృద్ధి మూడు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కి అనే రీతిలో కొనసాగుతుంది. పార్కులో సందర్శకులను ఆకట్టుకునేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున నిధులు కేటాయింపులు జరిగాయి. ఆ తర్వాత మేయర్ రాయన భాగ్యలక్ష్మి పార్కు అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి అనేక మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నా.. వాటిని పరిరక్షించడంలో సిబ్బంది నిర్లక్ష్యంతో అవి మూలన పడుతున్నాయి.

మురికి వాసన మధ్య వాకింగ్....

కేఎల్‌రావు పార్కులో ప్రతి నిత్యం ఉదయం వేళ పెద్ద ఎత్తున వాకర్స్ వాకింగ్ చేస్తూ ఉంటారు. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలతో బోటింగ్ కెనాల్‌లోకి వర్షం నీరు చేరి నాచు పట్టింది. బోటింగ్ నిలిపివేసి నాలుగేళ్లు అవుతున్నా కెనాల్‌లో నీటిని నిల్వ ఉంచి దోమలను పెంచుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కెనాల్‌లో నీటి నుంచి వస్తున్న దుర్వాసనతో వాకింగ్ చేయలేకపోతున్నామని అంటున్నారు. కడుపులో దేవేస్తుందని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి కెనాల్ గోడ కూలిపోయింది. దీంతో వాకర్స్ నడిచే దారిని మరో వైపు మళ్లించారు. ప్రజాధనాన్ని వెచ్చించి అభివృద్ధి చేస్తున్న కేఎల్‌రావు పార్కు నిర్వహణపై బాధ్యత కలిగిన సిబ్బందిని నియమించాలని పశ్చిమ వాసులు కార్పొరేషన్ అధికారులను కోరుతున్నారు.

చిన్నారులకు ఆహ్లాదం పంచాల్సిన కేఎల్‌రావు పార్కు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆట వస్తువులు నిరుపయోగంగా మారాయి. పార్కును శుభ్రం చేయాల్సిన సిబ్బంది మచ్చుకైనా కనిపించకపోవడంతో ఎక్కడ చూసినా గడ్డి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో కాసింత సేపు కుటుంబంతో పార్కులో ఆహ్లాదంగా గడుపుదామని వచ్చిన సందర్శకులకు నిరాశే ఎదురవుతుంది. పార్కు మధ్యన ఉన్న బోటింగ్ కెనాల్‌ను శుభ్రం చేసే వారు లేకపోవడంతో నాచు పేరుకుపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతుంది. బోటింగ్ కెనాల్ నీటిలో దోమలు, కప్పలు పెరిగిపోయి అటు వైపు చూడాలంటేనే అసహ్యం వేసే పరిస్థితి నెలకొంది. ఇంతటి దుర్భరమైన పరిస్థితులు ఉన్నా కనీసం కమిషనర్ పార్కు వైపు దృష్టి సారించకపోవడం శోచనీయమని స్థానికులు అంటున్నారు.

చిన్నారుల పరికరాలపై పెద్దలు...

పార్కులో చిన్నారుల కోసం ఊయ్యాలలు, ఊగే బల్ల, రౌండ్ టేబుల్ వంటి పరికరాలను ఏర్పాటు చేశారు. అయితే పార్కులోని సిబ్బంది ఎన్ని టికెట్లు అమ్ముతున్నాం.. ఎంత మిగిలిందనే చూస్తున్నారు తప్ప... పార్కులోని ఆట వస్తువులను ధ్వంసం చేస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్కులో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులపై పెద్దలు కూర్చుని ఊగడంతో అవి మరమ్మతులకు గురవుతున్నాయి. చంటి పిల్లలతో పార్కుకు వెళ్లిన తల్లిదండ్రులు ఊయలను ఖాళీ చేయాలని యువకులను అడిగితే వారిపై గొడవలకు దిగుతున్నారు.

ఆందోళనలో సందర్శకులు.....


పార్కుకు వచ్చే సందర్శకులు ఎక్కువ మంది లోపలకు వచ్చిన తర్వాత ఎడమ వైపు ఉన్న ఆట వస్తువుల వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో పార్కు సిబ్బంది ఆ ప్రాంతంలోనే శుభ్రం చేయడం, గడ్డి, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. దీంతో పార్కు ఈశాన్యం, తూర్పు భాగంలో గడ్డి పెద్ద ఎత్తున పెరిగిపోయింది. ఆ ప్రాంతంలో కూర్చుందామని అనుకున్నా ఏ గడ్డిలో నుంచి ఏ పాము వస్తుందోనని సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్కులో ఇంకా అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉండటంతో ఇక పూర్తి స్థాయిలో అందుబాటులోకి ఎప్పుడు వస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.



విరిగిపోయిన ఆట వస్తువులు



సందర్శకులు కూర్చునే బల్ల చుట్టూ పెరిగిన గడ్డి



కెనాల్‌లో కూలిపోయిన గోడ

త్రిబాణదారి బార్బరిక్ చిత్ర యూనిట్ సందడి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): త్రిబాణదారి బార్బరిక్ చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆదివారం గాంధీనగర్‌లోని రాజ్‌యువరాజ్ థియేటర్‌లో ప్రీమియర్ షో ఏర్పాటు చేశారు. ప్రీమియర్ షోకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాంకర్, నటి ఉదయభాను మాట్లాడుతూ త్రిబాణదారి బార్బరిక్ చిత్రం ప్రేక్షకుల్లో బజ్ క్రియేట్ చేస్తుందన్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ఈనెల 29న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుందని తెలిపారు. అయితే ముందుగానే చిత్రానికి సంబంధించిన ప్రీమియర్ షోలు ఏర్పాటు చేసి ప్రేక్షకుల స్పందన తెలుసుకుంటున్నామని చెప్పారు. చూసిన ప్రతి ఒక్కరూ చిత్ర బాగుందని ప్రశంసలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ సినిమాలో సత్యరాజ్ నటన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని, ప్రతి సన్నివేశం ఉత్కంఠ భరితంగా ఉంటుందన్నారు. సకుటుంబ సమేతంగా ఈ చిత్రాన్ని వీక్షించవచ్చని తెలిపారు. అనంతరం నటుడు సత్యం రాజేష్ మాట్లాడుతూ చిత్రం ప్రమోషన్స్‌కు ప్రేక్షకుల నుంచి స్పందన బాగుందన్నారు. ఓ క్రైమ్ కథకు మైథాలజీ టచ్ యాడ్ చేస్తూ మోహన్ శ్రీవత్స అద్భుతంగా తీశారన్నారు. దర్శకుడు మోహన్ శ్రీవత్స మాట్లాడుతూ చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. సమావేశంలో నిర్మాత విజయ్‌పాల్ రెడ్డి, నటులు మేఘన, క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భగవాన్ వెంకయ్య స్వామి విగ్రహ ప్రతిష్ట

భవానీపురంవిజయవాడపశ్చిమ):అవదూత భగవాన్ శ్రీవెంకయ్య స్వామి ఆరాధన ఉత్సవం సందర్భంగా భవానీపురం టీచర్స్‌కాలనీ శివాలయం రోడ్‌లోని శ్రీ దత్త-సాయి-భరద్వాజ సత్సంగ మందిరంలో ఆదివారం నిర్వహించిన వెంకయ్య స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభంగా జరిగింది. ఒక విగ్రహాన్ని ఆరాధనీయ దేవతా స్వరూపంగా మార్చేందుకు నిర్వహించాల్సిన బీజాక్షర మంత్రాలను పఠిస్తూ ప్రాణ ప్రతిష్ట తదితర క్రతువులను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహానికి నూతన వస్త్రాలను కట్టబెట్టి వెండి కిరీటాన్ని ధరింప చేశారు. ఈ సందర్భంగా భక్తులకు వెంకయ్య స్వామి అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. గత 25 ఏళ్లుగా ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ బోధించిన విధంగా మహాత్ముల చరిత్ర పారాయణ, సత్సంగాలను జరుపుతున్నామని మందిరం నిర్వాహకులు తెలిపారు.

గొల్లపూడిలో ముగిసిన వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలు

విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని శ్రీవీరాంజనేయ సహిత భగవాన్ శ్రీవెంకయ్య స్వామి మందిరంలో గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఆరాధనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఉభయదాతలతో రుద్ర హోమం నిర్వహించారు. అలాగే శ్రీవెంకయ్య స్వామివారి విశిష్ట సత్సంగం జరిగింది. కార్యక్రమంలో శ్రీహనుమద్దీక్షా పీఠాధిపతులు దుర్గా ప్రసాద్ స్వామీజీ ప్రవచిస్తూ సద్గురువే సకల దేవతా స్వరూపమని చెప్పారు. అటువంటి సద్గురువే అవదూత భగవాన్ శ్రీవెంకయ్య స్వామి అన్నారు. కలియుగంలో అవదూతల రూపంలో తాను ఉంటానని శ్రీదత్తాత్రేయ స్వామి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. దత్త వంశానికి చెందిన అటువంటి అవదూతే భగవాన్ గొలగమూడి శ్రీవెంకయ్య స్వామి అని వివరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కాగా వెంకయ్య స్వామి మందిరంలో ప్రతి శనివారం అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు స్వీకరించి స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని భగవాన్ శ్రీవెంకయ్య స్వామి ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ బోయపాటు శ్రీరాములు, వెంకట రత్నం తెలిపారు.



స్వామివారికి ధరింపచేసే వెండి కిరీటాన్ని చూపుతున్న అర్చకులు



గొల్లపూడిలోని వెంకయ్యస్వామి మందిరంలో రుద్ర హోమం

అర్జున్ చక్రవర్తి అందరినీ ఆకట్టుకుంటుంది

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఈ నెల 29న విడుదల కానున్న అర్జున్ చక్రవర్తి సినిమా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని ఆ చిత్ర హీరో విజయరామరాజు అన్నారు. ఆరేళ్లపాటు శ్రమించి ఈ చిత్రాన్ని అద్భుతంగా తీశామని, ప్రేక్షకులు వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో సినిమా యూనిట్ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో విజయరామరాజు మాట్లాడుతూ అర్జున్ చక్రవర్తి కేవలం సినిమా మాత్రమే కాదనీ నా 9 ఏళ్ల కల అన్నారు. ఎంతో కష్టపడి, టీమ్ వర్క్‌గా ఈ సినిమాని పూర్తి చేశామని నిర్మాత, మాపై పూర్తి విశ్వాసం ఉంచి, స్వేచ్ఛ ఇచ్చారన్నారు. ఈ చిత్రం తన కెరీర్‌కి టర్నింగ్ పాయింట్ అవుతుందని నమ్ముతున్నట్లు తెలిపారు. మైనస్ డిగ్రీ వాతావరణంలో షర్టు లేకుండా నటించానని , ప్రేక్షకులు తమ చిత్రాన్ని వీక్షించి ఆదరిస్తే కష్టానికి తగిన ఫలితం దక్కుతుందనీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఐపీఎల్‌లో కబడ్డీ ఆడే క్రీడాకారులను ఈ చిత్రంలో తీసుకొని వారితో కబడ్డీ ఆడే సన్నివేశాలను తీశామని చెప్పారు. ఈ సమావేశంలో హీరోయిన్ సీజ రోజ్, నిర్మాత శ్రీని, నటుడు యోగానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్జున్ చక్రవర్తి హీరో విజయరామరాజు తదితరులు

బుడమేరు కన్నీటి కష్టాలకు 'సంవత్సరీకం'

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు ముంపు నివారణకు ఏడాది కాలంలో కేటాయించిన నిధులు, చేపట్టిన పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడారు. గతేడాది ఆగస్టు 31, సెప్టెంబర్ ఒకటో తేదీన బుడమేరు వరదలతో విజయవాడ నగరంలోని లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారని, నరకయాతన అనుభవించారని గుర్తు చేశారు. నాడు ముందస్తు హెచ్చరికలు చేయడంలో ప్రభుత్వం విఫలమయిందని చెప్పారు. దాదాపు 50 మంది మరణించారని, రూ.వేల కోట్ల ఆస్తి నష్టం జరిగిందన్నారు. విజయవాడ, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు ప్రజల జీవితాలు అతలాకుతులం అయ్యాయని పేర్కొన్నారు. ఆ దెబ్బ నుంచి ప్రజలు నేటికీ పూర్తిగా కోలుకోలేదన్నారు. వరదల సమయంలో హడావిడి చేసిన సీఎం చంద్రబాబు బుడమేరు ముంపు ప్రమాదం నుంచి ప్రజలను కాపాడే చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. ఏడాది కాలంలో రూ.30 కోట్ల ఖర్చుతో ఒకచోట గండి పూడ్చి, గోడ నిర్మించడం తప్ప చేసిందేమీ లేదన్నారు. నష్టపోయిన బాధితులు, వ్యాపారులు, చిన్న పరిశ్రమలు, కార్మికులకు పరిహారం చెల్లింపులోనూ ప్రభుత్వం వెనుకబడిందన్నారు. తక్షణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు ఈనెల 30న నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు, దోనేపూడి కాశీనాథ్

28న శ్రీసుబ్రహ్మణ్య సంగీత సమితి వార్షికోత్సవం

విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో శ్రీసుబ్రహ్మణ్య సంగీత సమితి 10 వార్షికోత్సవాలను ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి సీవీ రావ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విఖ్యాత సంగీత విద్వాంసులు ధూళిపాల శ్రీనివాస్ వీణా వాద్య కచేరీ, హెచ్ఎస్ కార్తీక్ వయోలిన్, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ మృదంగంపై, ఎస్.కార్తీక్ ఘటంపై సహకరిస్తారని తెలిపారు.

ముత్యాలమ్మకు పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట ముత్యాలమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యాన అన్నప్రసాద వితరణ చేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, వి.సతీష్ పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేర చరిత్ర ఉన్న వాళ్లపై నిఘా

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):వినాయక చవితి వేడుకలను ఆసరాగా తీసుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే ఉపేక్షించేది లేదని, నేర చరిత్ర ఉన్న వారిపై నిరంతరం నిఘా ఉంటుందని వెస్ట్ ఏసీపీ దుర్గారావు హెచ్చరించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, క్రైం షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో ఊరేగింపులు, నిమజ్జనాల సందర్భంగా ఎటువంటి గొడవలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. చుట్టు పక్కల ఏదైనా గొడవ జరిగినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలా కాని పక్షంలో ఆయా ఘటనల్లో ఎవరి పాత్ర ఎంత ఉందో తెలుసుకుని కఠినంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కొత్తపేట సీఐ చిన కొండలరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న వెస్ట్ ఏసీపీ దుర్గారావు

ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా ఉత్సవాల నిర్వహణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభ, మతసామరస్యం వెల్లివిరిసేలా నిర్వహించాలని గణపతి నవరాత్రి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి ప్రసాదరాజు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పాకాల త్రినాథ్ రాజు తెలిపారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయంలో మండప నిర్వాహకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండపాల విషయంలో వచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నామని చెప్పారు. సింగిల్ విండో ద్వారా అనుమతులకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. మండపాల్లో అసభ్య పాటలు, రాజకీయ అంశాలు లేకుండా ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. సింగిల్ విండో విధానంలో సమస్యలు వస్తే సమితి పరిష్కరిస్తుందన్నారు. అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యదర్శి దుర్గాప్రసాద్ రాజు, త్రిమూర్తి రాజు మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం పరిశీలన తర్వాత ఎన్ఓసీ జారీ చేస్తుందన్నారు. ఉత్సవాలకు సంబంధించిన భక్తి గీతాలను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు బిట్ర వెంకటేశ్వరరావు, కార్యదర్శి నాసా శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు రావి కృష్ణారావు, బాలకృష్ణ, సంజయ్ మెహతా, వల్లపు రాజా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఉత్సవ సమితి సభ్యులు

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి ఆదిదంపతులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరో వైపున అమ్మవారికి, స్వామి వారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రద్దీ అధికంగా ఉండటంతో అన్ని దర్శన టికెట్ల విక్రయాలను నిలిపివేశారు. మహామండపం లిఫ్ట్ ద్వారా వచ్చే భక్తులకు 5వ అంతస్తు వద్ద నిలిపివేసి క్యూలైన్‌లోకి మళ్లించారు. మరో వైపున వీఐపీలకు, సిఫార్సు లేఖలపై వచ్చే వారికి సైతం అంతరాలయ దర్శనం నిలిపివేసి, బంగారు వాకిలి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం మహా నివేదన నేపథ్యంలో అన్ని దర్శనాలు అరగంట పాటు నిలిపివేశారు. దీంతో క్యూలైన్‌లో భక్తుల రద్దీ మరింత పెరిగింది. ఆ తర్వాత దర్శనాలు తిరిగి ప్రారంభం కాగా సర్వ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు సూర్య భగవానుడి చిత్రపటానికి పూజా కార్యక్రమాలను జరిపించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహిస్తామని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

ముగిసిన గాజుల అలంకరణ



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ముగ్గురమ్మలకు గాజుల అలంకరణ ఆదివారంతో ముగిసింది. శ్రావణమాసం పురస్కరించుకుని భక్తుల సహకారంతో అమ్మవారిని, గర్భాలయాన్ని గాజులతో అలంకరించారు. అమ్మవారికి ప్రీతికరమైన ఈ గాజుల అలంకరణను తిలకించేందుకు గత మూడు రోజులుగా గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం సందర్భంగా గత నెల రోజులుగా ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో వ్రతాలు ఆచరించారు. పలువురు మహిళలు పాలపొంగళ్లు భక్తిశ్రద్ధలతో సమర్పించారు.